సాక్షి సంగారెడ్డి

శుక్రవారం । 28 । ఫిబ్రవరి । 2025



రోగాలను మట్టి కరిపించేలా

వ్యాధులను తగ్గించుకునేందుకు వ్యాసమహర్షి యోగా సొసైటీ ప్రజలకు మట్టిస్నానాలపై అవగాహన కల్పిస్తోంది. వివరాలు 8లో ▸



దర్శించి... తరించి

కొమురవెల్లి మల్లికార్జునస్వామిని దర్శించుకునేందుకు బుధవారం రాత్రి భక్తులు బారులు తీరారు. వివరాలు 8లో ▸



ఇరుకు రోడ్లు..

జహీరాబాద్‌లో రోడ్లు ఇరుకుగా ఉండటంతో అటువైపు ప్రయాణమంటేనే వాహనదారులు హడలిపోతున్నారు. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

దత్తగిరిలో లక్షపుష్పార్చన



దత్తగిరిలో రుద్రాభిషేకం చేస్తున్న పీఠాధిపతి

ఝరాసంగం(జహీరాబాద్): జిల్లాలో ఆధ్యాత్మిక క్షేత్రమైన బర్దీపూర్ శ్రీ దత్తగిరి మహారాజ్ ఆశ్రమంలో మహాశివరాత్రిని పురస్కరించుకుని బుధవారం రాత్రి ప్రత్యేక పూజలు చేశారు. ఆశ్రమ పీఠాధిపతి మహామండలేశ్వర్ సిద్దేశ్వరానందగిరి మహారాజ్ ఆధ్వర్యంలో అర్ధరాత్రి ఆశ్రమంలోని 12 జ్యోతిర్లింగాలకు మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష పుష్పార్చన ప్రారంభించారు. వేదమంత్రాలు, శివ నామస్మరణతో మార్మోగింది. గురువారం ఉదయం జ్యోతిర్లింగాలకు సప్తహారతి, అనంతరం మహా మంగళహారతి నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఐఎన్‌హెచ్‌ఆర్‌పీసీ జిల్లా అధ్యక్షుడిగా ఓం ప్రకాష్



నారాయణఖేడ్: ఇండియన్ నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా నాగల్‌గిద్ద మండలం ఊటిపల్లి గ్రామానికి చెందిన డి.ఓం ప్రకాష్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర చైర్మన్ ఆచార్య నవోదయసిద్దు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. సామాజిక కార్యకర్తగా, రక్తదాన గ్రూపు సభ్యుడిగా, విద్యావేత్తగా ఓం ప్రకాష్ సేవలను గుర్తించి ఈ పదవిలో నియమించినట్లు అందులో పేర్కొన్నారు.

ఓటుహక్కు వినియోగించుకున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి



ఓటుహక్కు వినియోగించుకున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి, ఆయన కుటుంబసభ్యులు

నారాయణఖేడ్: ఖేడ్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పట్టభద్రులకు సంబంధించిన పోలింగ్ కేంద్రంలో ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, అనుపమారెడ్డి దంపతులు గురువారం ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరి కుమారుడు అనురాగ్‌రెడ్డి, ఎమ్మెల్యే సోదరులైన డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకులు సుధాకర్‌రెడ్డి, కుటుంబసభ్యులు సంధ్యారాణి, అన్వేశ్‌రెడ్డి తదితరులు కూడా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

నాగల్‌గిద్ద ఆలయాభివృద్ధికి కృషి

నాగల్‌గిద్ద మండల కేంద్రంలోని శివాలయాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని సంజీవరెడ్డి అన్నారు. మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని నాగల్‌గిద్దలోని శివాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజా నిర్వహించారు.

వేతనాల కోసం అంగన్‌వాడీల నిరసన

జహీరాబాద్ టౌన్: రెండు నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీలు సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం సీపీడీవో కార్యాలయం ముందు నిరసన తెలిపారు. పండుగపూట పస్తులా..అంటూ ప్లకార్డులు పట్టుకుని నినదించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి మహిపాల్ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు నిరుపేదలని, వీరికి పలు కారణాలు చూపుతూ రెండు నెలల నుంచి జీతాలు ఇవ్వడంలేదన్నారు. వెంటనే జీతాలు ఇవ్వకుంటే నిరసన కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

వైభవంగా కేతకీ ఉత్సవాలు



ఝరాసంగం(జహీరాబాద్): శ్రీ కేతకీ సంగమేశ్వర ఆలయంలో మహాశివరాత్రిని పురస్కరించుకుని చేపట్టిన బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. తెలుగురాష్ట్రాలతోపాటు కర్ణాటక, మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఉత్సవాల్లోభాగంగా గురువారం పార్వతీ పరమేశ్వరులకు అభిషేకం, కుంకుమార్చనతోపాటు నిత్య పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం ఐదు గంటల సమయంలో భక్తుల శివ నామస్మరణ, దండకాల మధ్య నంది వాహన సేవ ఊరేగింపు కొనసాగింది. బుధవారం రాత్రి ఆలయ ఆవరణలో శివ జాగరణ చేశారు. ఆలయ ఆవరణలో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.



సంగారెడ్డిలోని తార కళాశాలలో ఓటు వేసేందుకు క్యూలో వేచి ఉన్న మహిళలు



ఓటు వేసేందుకు తల్లి లోపలికి వెళ్లడంతో చిన్నారిని ఎత్తుకున్న మహిళా కానిస్టేబుల్



పోలింగ్ కేంద్రానికి దివ్యాంగుడిని వీల్ చైర్‌లో తీసుకొస్తున్న సిబ్బంది



సంగారెడ్డిలోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

ఓటెత్తారు

ప్రశాంతంగా ముగిసిన ఎమ్మెల్సీ పోలింగ్

- ఉత్సాహంగా ఓట్లేసిన ఉపాధ్యాయులు, పట్టభద్రులు
- పట్టభద్రుల పోలింగ్ 73.19% నమోదు
- ఉపాధ్యాయుల పోలింగ్ 92.57 శాతం
- కరీంనగర్‌లోని కౌంటింగ్ కేంద్రాలకు బ్యాలెట్ బాక్సులు
- పోలింగ్ సరళిని పర్యవేక్షించిన కలెక్టర్ వల్లూరు క్రాంతి

పలు చోట్ల ట్రాఫిక్ సమస్య

పోలింగ్ కేంద్రాల సమీపంలో పలుచోట్ల ట్రాఫిక్ సమస్య తలెత్తింది. జిల్లా కేంద్రంలోని తారా డిగ్రీ కళాశాల పోలింగ్ కేంద్రం వద్ద ఉదయం 11 గంటల సమయంలో ఓటర్ల తాకిడి పెరిగిపోయింది. ఓటర్లు ఎక్కువగా కార్లలో రావడంతో బైపాస్‌రోడ్డు నుంచి తారా డిగ్రీ కాలేజీ వరకు ఉన్న రోడ్లు ట్రాఫిక్ జాం అయింది. బైపాస్ రోడ్డు వరకు వాహనాలు నిలిచిపోయాయి.

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ గురువారం సజావుగా ముగిసింది. ఓటర్లు ఉత్సాహంతో పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. పట్టభద్రులతోపాటు, ఉపాధ్యాయ ఓటర్లు తమకిష్టమైన అభ్యర్థులకు ప్రాధాన్యత క్రమంలో ఓటు వేశారు.

పోలింగ్ ప్రక్రియ ఉదయం ఎనిమిది గంటలకే ప్రారంభమైంది. శివరాత్రిని పురస్కరించుకుని ఉపవాసాలు, జాగరణలు చేసిన చాలామంది ఓటర్లు తెల్లవారిన తర్వాత తమ పూజలు, ఉపవాస దీక్షలు ముగించుకుని పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారు. దీంతో పోలింగ్ ప్రారంభమైన తొలి రెండు గంటలు పోలింగ్ ప్రక్రియ మందకొడిగా సాగింది. తర్వాత ఉదయం 10 గంటల సమయంలో పోలింగ్ ప్రక్రియ ఊపందుకుంది. సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ కొనసాగింది. నాలుగు గంటల లోపు పోలింగ్ కేంద్రాలకు వచ్చిన ఓటర్లందరికీ స్లిప్పులు పంపిణీ చేసిన అధికారులు వారందరికీ ఓటు వేసే అవకాశం కల్పించారు. జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి పోలింగ్ సరళిని పర్యవేక్షించారు. జిల్లాలో పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించిన క్రాంతి పోలింగ్ ప్రక్రియను పరిశీలించారు. ఉపాధ్యాయ ఓటర్లు రెండు ఓట్లు వేశారు. ఇటు ఉపాధ్యాయ ఎమ్మెల్సీతోపాటు, పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి తమ ఓటు హక్కులను వినియోగించుకున్నారు. పోలింగ్ ముగిసే సమయానికి పట్టభద్రులు 73.19% ఉపాధ్యాయులు 92.57% పోలింగ్ నమోదైంది.

- పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి సంబంధించి జిల్లాలో మొత్తం 40 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ ప్రక్రియ కొనసాగింది. పట్టభద్రుల ఓటర్లు మొత్తం 25,652 మంది ఓటర్లు ఉండగా.. ఇందులో 18,774 మంది పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.
- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి సంబంధించి 28 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ ప్రక్రియ కొనసాగింది. మొత్తం 2,690 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉన్నారు. ఇందులో 2,490 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.
- పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం బరిలో ఏకంగా 56 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఇందులో ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన అభ్యర్థులు 11 మంది ఉన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానం బరిలో మొత్తం 15 మంది ఉండగా, అందులో ఐదుగురు ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన అభ్యర్థులు ఉన్నారు.



సంగారెడ్డి తార కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఓటు వేసేందుకు క్యూలో ఉన్న ఓటర్లు

పట్టభద్రుల ఓటర్ల ఓటింగ్ సరళి ఇలా..

రెవెన్యూ డివిజన్	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	పోలింగ్ శాతం
సంగారెడ్డి	15,094	11,058	73.26%
జోగిపేట	2,437	1,854	76.08%
నారాయణఖేడ్	3,577	2,533	70.81%
జహీరాబాద్	4,544	3,329	73.26%
మొత్తం	25,652	18,774	73.19%

ఉపాధ్యాయ ఓటర్ల ఓటింగ్ సరళి ఇలా..

రెవెన్యూ డివిజన్	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	పోలింగ్ శాతం
సంగారెడ్డి	1,621	1,480	91.30%
జోగిపేట	185	170	91.89%
నారాయణఖేడ్	375	358	95.47%
జహీరాబాద్	509	482	94.70%
మొత్తం	2,690	2,490	92.57%

ప్రాధాన్యత క్రమంలో ఓటింగ్..

సాధారణ పోలింగ్‌కు భిన్నంగా ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ఉంటుంది. ఓటరుకు బరిలో ఉన్న అభ్యర్థులందరికీ ప్రాధాన్యత క్రమంలో ఓటు వేసే అవకాశం ఉంటుంది. మొదటి, రెండో, మూడో.. ఇలా ప్రాధాన్యత క్రమంలో ఓటు వేశారు. పోలింగ్ ప్రక్రియ పూర్తయిన వెంటనే బ్యాలెట్ బాక్సులను కరీంనగర్ జిల్లాలోని అంబేడ్కర్ ఇండోర్ స్టేడియంలోని ఓట్ల లెక్కింపు కేంద్రాలకు తరలించారు. మార్చి 3న ఇదే స్టేడియంలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభించనున్నారు.

పోలింగ్ సమయం ముగిసాక కూడా..

ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరిగింది. నాలుగు గంటలలోపు పోలింగ్ కేంద్రాలకు వచ్చిన ఓటర్లందరికీ అధికారులు ఓటు వేసే అవకాశం కల్పించారు. నాలుగు గంటల లోపు కేంద్రాలకు చేరుకున్న ఓటర్లకు ముందుగా స్లిప్పులు పంపిణీ చేశారు.

పోలింగ్ కేంద్రాల వద్ద హడావిడి..

కొన్ని పోలింగ్ కేంద్రాల వద్ద పట్టభద్రుల కంటే...ఉపాధ్యాయుల హడావిడి ఎక్కువగా కనిపించింది. ఆయా ఉపాధ్యాయ సంఘాలు కేంద్రాలకు కొద్ది దూరంలో ఓటరు సహాయ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆయా సంఘాల నేతలు ఈ శిబిరాల వద్ద ఉంటూ ఓటు వేసేందుకు వచ్చిన వారికి సహాయం అందించారు. అయితే ఇక్కడ పట్టభద్రుల కంటే, ఉపాధ్యాయ సంఘాల హడావిడే ఎక్కువగా కనిపించింది.

ఎమ్మెల్సీ ఎన్నికలపై డంపింగ్ యార్డ్ ఎఫెక్ట్

- ఆసక్తి చూపని పట్టభద్రులు
- పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన ఆర్డీవో

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మున్సిపాలిటీలో ఎమ్మెల్సీ ఎన్నికలపై డంపింగ్ యార్డ్ ప్రభావం కనిపించింది. జిల్లాలోని అతి తక్కువ పోలింగ్ జరిగిన మండలంగా గుమ్మడిదల నిలిచింది. ఎమ్మెల్సీ ఎన్నికలపై జేఏసీ నాయకులు ఇచ్చిన పిలుపుతో పట్టభద్రులు ఎన్నికలకు దూరంగా ఉన్నారు. పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్ల సందడి కనిపించకుండా పోయింది. తమ ప్రాంత సమస్యను పరిష్కరించేంత వరకు ఎటువంటి కార్యకలాపాల్లో పాల్గొనకుండా గ్రామస్తులు ముందుకు వెళ్తున్నారని తెలుస్తోంది. కాగా, జిల్లా యంత్రాంగం గుమ్మడిదలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి పోలింగ్ జరుగుతున్న తీరును పరిశీలించేందుకు ఆర్డీవో రవీందర్‌రెడ్డి క్షేత్రస్థాయిలో పర్యటించారు. పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి ప్రజలకు పట్టభద్రులకు భరోసా కల్పించారు. భయాందోళన చెందకుండా స్వేచ్ఛగా ముందుకు వచ్చి ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. ఎవరైనా భయభ్రాంతులకు గురి చేస్తే చర్యలు తీసుకుంటామని భరోసా కల్పించినప్పటికీ అధికారుల మాటలను స్థానిక పట్టభద్రులు ఏమాత్రం పట్టించుకోలేదు. ఎట్టి పరిస్థితుల్లో ఓటు వేసేది లేదని తీర్మానించుకుని మరీ ఇంటికే పరిమితమయ్యారు. దీంతో నాలుగు గంటల వరకు కొనసాగిన పోలింగ్‌కు ఎటువంటి స్పందనా లేకుండా పోయింది. ఎన్నికల అధికారులు సిబ్బంది పోలింగ్ కేంద్రంలో గంటల తరబడి ఖాళీగానే కూర్చున్నారు. బహిష్కరణతో ఎన్నికలపై ప్రభావం కనిపించింది. మొత్తంగా 295 మంది పట్టభద్రులు ఉండగా కేవలం 42 మంది మాత్రమే ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో కూడా స్థానికేతరులే ఉన్నారని తెలుస్తోంది. ఇక 19 మంది ఉపాధ్యాయులు ఉండగా 18 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. కాగా, ఎమ్మెల్సీ ఎన్నికలపై డంపింగ్ యార్డ్ ప్రభావం పెద్దగానే పడింది. దీంతో జేఏసీ సభ్యులు ఆందోళనకారులు తమ పిలుపు విజయవంతమైందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన ఆర్డీవో రవీందర్‌రెడ్డి

మల్లన్న పట్నం.. పోటెత్తిన జనం



ఆలయ ఆవరణలోని తోటబావి ప్రాంగణంలో పెద్దపట్నం వేస్తున్న ఒగ్గుపూజారులు

కొమురవెల్లి(సిద్దిపేట): మల్లన్న క్షేత్రంలో పెద్దపట్నం వైభవంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మహాశివ రాత్రి పర్వదినం పురస్కరించుకుని తోటబావి వద్ద బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం తెల్లవారుజాము వరకు పెద్ద పట్నం వేడుకలు కనులపండువగా జరిగాయి. అదే సమయంలో గర్భగుడిలో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ఈఓ రామాంజనేయులు, ధర్మకర్తలు, అర్చకులు స్వామి వారి ఉత్సవ విగ్రహాలను పురవీధుల్లో ఊరేగించారు. పెద్దపట్నం నిర్వహించే తోట బావి ప్రాంగణానికి చేర్చారు. వేడుకలను చూసేందుకు తెలుగు రాష్ట్రాల తోపాటు మహారాష్ట్ర, కర్ణాటక నుంచి భారీగా భక్తులు తరలివచ్చారు.

బండ్ల జోరు.. జాతర హోరు

పాపన్నపేట(మెదక్): జోడెడ్ల బండ్ల జోరు.. బోనాల హోరు.. డప్పు చప్పుళ్లతో ఏడుపాయల్లోని కొండా కోన ప్రతి ధ్వనించాయి. జాతర రెండో రోజు గురువారం బండ్ల ఊరేగింపు కనుల పండువగా జరిగింది. ఆచారం ప్రకారం పాపన్నపేట సంస్థానాధీశుల బండికి నాగ్సాన్‌పల్లి వద్ద పనిబాటల వారు, ఆలయ అధికారులు స్వాగతం పలికారు. యువకుల నృత్యాల మధ్య బండ్ల ఊరేగింపు కొనసాగింది.



ఏడుపాయల్లో బండ్లు తిరుగుతున్న దృశ్యం

అలరించిన కుస్తీ పోటీలు



కుస్తీ పోటీల్లో తలపడుతున్న మల్లయోధులు

కల్హేర్(నారాయణఖేడ్): నిజాంపేట్ మండలం బాచేపల్లి శివారులో ఉమ సంగమేశ్వర మందిరం వద్ద గురువారం కుస్తీ పోటీలు ఘనంగా నిర్వహించారు. చుట్టుపక్క గ్రామాల నుంచి మల్లయోధులు తరలివచ్చారు. కుస్తీ పోటీల్లో విజేతలకు నిర్వాహకులు నగదు బహుమతి అందజేశారు. చివరి కుస్తీ పోటీ విజేతకు రూ.5 వేలు నగదు అందజేశారు. కార్యక్రమంలో మాజీ రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు పట్లోళ్ల దుర్గారెడ్డి, నిర్వాహకులు జగం శివస్వామి, గ్రామస్తులు వెంకట్‌రెడ్డి, సంగారెడ్డి పాల్గొన్నారు.

నిధుల లేమితో నిలిచిన నిర్మాణాలు

16 భవనాలకు రూ.6.90 కోట్లు మంజూరు

- అసంపూర్తిగా సామూహిక భవనాలు
- అవస్థలు పడుతున్న ప్రజలు

జహీరాబాద్ టౌన్: సబ్బండ వర్గాల కోసం జహీరాబాద్‌లో నిర్మిస్తున్న సామూహిక(ఆత్మగౌరవ) భవనాలు నిధుల కొరత కారణంగా నిలిచిపోయాయి. ప్రారంభంలో పనులు శరవేగంగా కొనసాగినా...నిధులు తదితర కారణాల వల్ల పనులు మధ్యలో ఆగిపోయాయి. దీంతో పేదలు శుభకార్యాలు చేసుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. సభలు, సమావేశాలు కూడా నిర్వహించలేకపోతున్నారు.

నాటి మంత్రి హరీశ్‌రావు చొరవతో...

జహీరాబాద్ మున్సిపల్‌లో పరిధిలో రోజు రోజుకు జనాభా పెరుగుతోంది. నియోజకవర్గంలో పేదలు ఉపాధి కోసం పట్టణాలకు వస్తున్నారు. శుభకార్యాలప్పుడు ఖాళీ స్థలాలు లేక ఫంక్షన్‌హాల్ అద్దెకు తీసుకోవాల్సి వస్తోంది. ఆర్థిక స్థోమతలేక పేదలు నానా అవస్థలు పడుతున్నారు. ఈ సమస్యను దృష్టిలో పెట్టుకుని కుల సంఘాల నాయకులు మాజీ మంత్రి హరీశ్‌రావు జహీరాబాద్‌కు వచ్చిన సందర్భంలో సామూహిక భవనాల కోసం వినతిపత్రాలిచ్చారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం కూడా సబ్బండ వర్గాలకు సముచిత గౌరవం కల్పించాలన్న ఉద్దేశంతో కమ్యూనిటీ భవనాలకు భారీగా నిధులు మంజూరు చేయించింది. రెండున్నరేళ్ల క్రితం 16 కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం కోసం రూ.6.90 కోట్లను మంజూరు చేసింది. దీంతో కుల సంఘాల నాయకులు, ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.



హౌసింగ్‌బోర్డు కాలనీలో ఆగిన బంజార భవనం



పిల్లర్ దశలో నిలిచిన షాదీఖాన

ఆగిన పనులు

పట్టణంతోపాటు చుట్టూ ప్రాంతాల్లోని ప్రభుత్వ భూములను గుర్తించి కమ్యూనిటీ హాళ్లకు స్థలాలను కేటాయించడం జరిగింది. సొంత స్థలం ఉన్న వారికి నిధులు మంజూరు చేశారు. పద్మశాలి భవనం, ముస్లిం షాదీఖాన, ఆర్యవైశ్య, నాయిబ్రహ్మణ, ముదిరాజ్, రజక తదితర సామూహిక భవనాలకు నిధులు మంజూరు చేయించి పనులను ప్రారంభించారు. సాధారణ ఎన్నికల వరకు చురుగ్గా పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు తర్వాత ఆపేశారు. కొన్ని భవనాల పనులను ఇంతవరకు ప్రారంభించలేదు. ప్రభుత్వం మారడంతో నిధులు రద్దయిపోయాయి. దీంతో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయి భవనాలు అసంపూర్తిగా మిగిలిపోయాయి. ప్రభుత్వం స్పందించి భవనాలకు నిధులు మంజూరు చేయించి మిగులు పనులను పూర్తి చేయాలని కుల సంఘాల నాయకులు, ప్రజలు కోరుతున్నారు.

“ పనులు ప్రారంభించాలి



ముదిరాజ్ భవన నిర్మాణానికి గత ప్రభుత్వ పాలనలో రూ.కోటి మంజూరయ్యాయి. కాంట్రాక్టర్ సకాలంలో పనులను ప్రారంభించలేదు. ప్రభుత్వం మారడంతో నిధులు రద్దు అయినట్లు తెలసింది. సామూహిక భవన నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించాలి

– బరూర్ దత్తాత్రి, జహీరాబాద్

క్లుప్తంగా

బ్రహ్మోత్సవాలకు రావాలని కేసీఆర్‌కు ఆహ్వానం



కేసీఆర్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న శ్రీనివాస్‌గుప్తా

మర్కూక్(గజ్వేల్): మండలంలోని అంగడి కిష్టాపూర్ ఉమా మహేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని కోరుతూ ఆలయ చైర్మన్ శ్రీనివాస్‌గుప్తా మాజీ సీఎం కేసీఆర్‌కు ఆహ్వాన పత్రిక అందజేశారు. ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకుడు రాములుగౌడ్ వేడుకలకు హాజరు కావాలని కోరినట్లు ఆయన తెలిపారు.

యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం



యోగాసనాలు వేస్తున్న మహిళలు

హుస్నాబాద్: ధర్మవీర్ యోగా శిక్షణ శిబిరం ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా శివాజీనగర్ రైతుబజార్‌లో గురువారం వార్షికోత్సవం నిర్వహించారు. యోగా గురువు అనిత యోగాసనాలు వేసి చూపించారు. ముఖ్య అతిథిగా మంత్రి పొన్నం ప్రభాకర్ సతీమణి మంజుల హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ.. యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని, ప్రతి రోజు కొంత సమయం కేటాయించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ రజిత, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి రెడ్డి, పద్మ, శంకర్, అశోక్, శ్రీనివాస్, సుప్రజ, శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలు విక్రయిస్తే కఠిన చర్యలు



పాన్ షాపు వద్ద డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేస్తున్న సీఐ, ఎస్‌ఐలు

దుబ్బాకటౌన్: ప్రస్తుత సమాజంలో నేటి యువత డ్రగ్స్, గంజాయి, మాదక ద్రవ్యాలకు బానిసలై బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని దుబ్బాక సీఐ శ్రీనివాస్ అన్నారు. సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ ఆదేశాల మేరకు పట్టణంలోని పాన్ షాపులు, డబుల్ బెడ్ రూమ్ కాలనీలో గురువారం రాత్రి డాగ్ స్క్వాడ్‌తో ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ..యువత, విద్యార్థులు మాదకద్రవ్యాలకు బానిసలుగా మారి జీవితాలు నాశనం చేసుకుంటున్నారని, వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లల జీవనశైలిని తల్లిదండ్రులు తప్పనిసరిగా గమనిస్తుండాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ గంగరాజు, డాగ్ స్క్వాడ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

– ఐదుగురిపై కేసు నమోదు

ములుగు(గజ్వేల్) : ములుగు మండలం తున్కిబొల్లారంలో పేకాట స్థావరంపై గురువారం రాత్రి సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, ములుగు పోలీసులు దాడి చేశారు. ఎస్‌ఐ విజయ్‌కుమార్ కథనం మేరకు.. తున్కిబొల్లారంలో ఓ ఇంటిలో కొందరు పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. టాస్క్‌ఫోర్స్ పోలీస్‌లతో కలిసి పేకాట స్థావరంపై దాడి చేయగా తున్కిబొల్లారం, తిమ్మాపూర్‌కు చెందిన ఐదుగురు పట్టుబడ్డారు. వారిని అదుపులోకి తీసుకొని రూ.25,880 నగదు, 5 ఫోన్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. బహిరంగ ప్రదేశాలు, ఫామ్ హౌస్‌లు, ఇళ్లలో పేకాట తదితర చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు తెలిస్తే సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ అధికారుల నంబర్లు 87126 67445, 87126 67446కు సమాచారమివ్వాలని సూచించారు.



పెద్దపట్నం తొక్కుతున్న భక్తులు, శివసత్తులు



పెద్దపట్నం వేసేందుకు ఆవాహనం చేస్తున్న నిర్వాహకులు



బారికేడ్లు దాటుతున్న భక్తులు



దర్శనంలో మహారాష్ట్ర వాసులు

దర్శించి.. తరించి

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో బుధవారం రాత్రి నిర్వహించిన పెద్ద పట్నం దాటేందుకు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. తెలంగాణతోపాటు మహారాష్ట్రలోని లాతూర్, నాందేడ్, పర్బని జిల్లాలకు చెందిన సుమారు 3,000 మంది భక్తులు దర్శించుకున్నారు. అనంతరం స్వామి వారికి పట్నాలు బోనాలు చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు ఒక్కసారిగా బారికేడ్లపై నుంచి చొచ్చుకు రావడంతో పోలీసులు లాఠీచార్జ్ చేశారు. అలాగే, ఆలయం వద్ద స్నానమాచరించడానికి భక్తులకు తిప్పలు తప్ప లేదు. ఆలయ సమీపంలోని చెరువు వద్ద షవర్స్ ఏర్పాటు చేశారు. కానీ నీరు బయటకు వెళ్లేందుకు మార్గం లేక నీరు అక్కడే నిల్వ ఉంది. దీంతో భక్తులు మోకాలు లోతు మురుగు నీటిలోనే స్నానమాచరించారు.



చెరువు వద్ద స్నానమాచరిస్తున్న భక్తులు

రోగాలను మట్టికరిపించేలా..

సిద్దిపేటలో నెలకోసారి మడ్ బాత్

- చర్మ సంబంధిత వ్యాధులు దూరం
- ప్రస్తుత కాలంలో మట్టి నేలలే కరువు
- పూర్వపు విధానాలే మేలంటున్న యోగా గురువులు
- పోషకాలు పుష్కలమంటున్న నిపుణులు



మట్టి పూసుకొని సూర్యరశ్మికి ఎదురుగా..

సాక్షి, సిద్దిపేట : కాళ్లకు కొంచెం బురద మట్టి అంటితే కడుక్కుంటాం.. కొందరు బురదను చూస్తే అసహ్యించుకుంటారు.. చిన్న పిల్లలు మట్టిలో ఆడితే వెంటనే చేతులు కడుగుతాం.. అలాంటిది మట్టి రుద్దుకొని స్నానం చేస్తున్నారు వీరంతా. మారుతున్న జీవనశైలికి తగ్గట్టుగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకోవడంతో అనేక రోగాలు ప్రజలను పట్టి పీడిస్తున్నాయి. వీటిన్నింటికీ పూర్వపు విధానాలే మేలంటూ వందల ఏళ్ల చరిత్ర కలిగిన మట్టి స్నానంపై సిద్దిపేటకు చెందిన వ్యాస మహర్షి యోగా సొసైటీ వారి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

మట్టి నేలలే కరువు

ప్రస్తుత కాలంలో మట్టిని తాకడమే తగ్గింది. సీసీ రోడ్‌లు, డాంబర్ రోడ్‌లు, రకరకాల బండల మీదనే నడుస్తున్నాం. మట్టినేలపై నడవడమే లేదు. పూర్వకాలంలో మనుషులు కాళ్లకు చెప్పులు లేకుండానే నడిచేవారు. అప్పుడు ఎలాంటి రోగాల బారిన పడేవారు కాదు. ఇప్పుడు మనుషులను అనేక రోగాలు వెంబడిస్తున్నాయి. అందుకే పాత కాలం పద్ధతులను మళ్లీ ప్రజలు పాటిస్తున్నారు. అందులో భాగంగానే మట్టి స్నానం చేస్తున్నారు.

తయారీ ఇలా..

పుట్ట మట్టితోపాటు కుప్పటి ఆకు, గోమూత్రం, ఆవు పేడ, వేపాకు, తులసి ఆకుల, కలబంద, చందనం, తేనె, పాలు, నెయ్యి, నిమ్మ, వట్టి వేర్లు, పసుపు మిశ్రమాన్ని తయారు చేస్తారు. ఈ మట్టిలో కలిపిన మిశ్రమాన్ని నీటిలో కలిపి శరీరానికి పెట్టుకున్న తర్వాత సూర్యరశ్మి తగిలేలా దాదాపు గంటపాటు ఉన్న తర్వాత స్నానం చేస్తున్నారు.



మట్టిని పూసుకొని యోగాసనాలు

చర్మ వ్యాధులు దూరం

సిద్దిపేటలో నెలకోసారి ఈ మడ్ బాత్ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. దీని పై అవగాహన ఉన్న వారు ఎక్కువ వస్తున్నారు. అలాగే, మరికొందరు మడ్‌బాత్ గురించి తెలుసుకొని మట్టి స్నానం చేస్తున్నారు. దీని వల్ల దాదాపు 50 రకాల చర్మ వ్యాధులు దూరమవుతాయని యోగా గురువులు చెబుతున్నారు. స్వేద రంధ్రాలు తెరుచుకుంటాయి. చర్మ సంబంధిత వ్యాధుల తోపాటు చెడు కొలెస్ట్రాల్ థైరాయిడ్ సమస్యలు, ఉదర సమస్యలు, మోకాళ్ల నొప్పులు, జీర్ణ సంబంధ వ్యాధుల నుంచి దూరమవుతాయని చెబుతున్నారు. మట్టి పట్టి వేసుకోవడం వల్ల ఎముకల్లోని మజ్జ పెరిగి మోకాళ్ల నొప్పులు తగ్గుతాయని అంటున్నారు.

మట్టిలో అనేక పోషకాలు



మట్టి స్నానం ఇది అనాది కాలం నుంచి ఉన్నటువంటి పద్ధతి నేటి యాంత్రిక యుగంలో దీనిని ఆచరించే వారు తగ్గిపోయారు. ఈ మట్టిలో పాలు, నెయ్యి, గోమూత్రం, ఆవు పేడ ఇలా అనేకమైనవి కలపడం జరుగుతుంది. మట్టిలో అనేక పోషకాలుంటాయి. చర్మ వ్యాధులు, కీళ్ల నొప్పులు, బరువు, షుగర్, బీపీలను తగ్గిస్తుంది.

– తోట సతీష్, యోగా శిక్షకుడు, వ్యాస మహర్షి యోగా సొసైటీ, సిద్దిపేట

మా తాతలు అంటుంటే విన్నాం



మట్టి పుసుకొని స్నానం చేస్తారని మా తాతలు అంటుంటే విన్నాం కానీ మాకు తెలిసేది కాదు. మా యోగా కేంద్రంలో ప్రారంభించిన తర్వాతనే నేను స్వయంగా చూశాను. మడ్ బాత్ చేయడం వల్ల చాలా అద్భుతంగా ఉంటుంది. బాడీలో ఉన్న వేడి సైతం తీసేస్తుంది. దీని వల్ల చాలా లాభాలున్నాయి.

– ప్రభాకర్, సిద్దిపేట

మట్టిని బట్టి లాభాలు



మడ్ బాత్ చేయడం వల్ల పలు రకాల చర్మ, జీర్ణ సంబంధిత వ్యాధులను తగ్గించవచ్చు. ఒక్కో దగ్గర మట్టిని పూసుకుంటే ఒక విధమైన లాభం ఉంటుంది. వండ్రు మట్టి, పుట్ట మట్టి లేదా నాలుగు అడుగుల లోతు భూమిని తవ్విన మట్టినే ఎంపిక చేసుకోవాలి. ఏ మట్టి పడితే ఆ మట్టితో స్నానం చేయొద్దు.

– డాక్టర్ విజయ్ గణేశ్ రెడ్డి, ప్రొఫెసర్, అనంత లక్ష్మి ఆయుర్వేదిక్ వైద్య కళాశాల, వరంగల్

జీవ వైవిధ్య సదస్సుకు ములుగు విద్యార్థులు

- పలు అంశాలపై ప్రముఖులు అవగాహన
- గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందజేత



విద్యార్థి అనీశ్‌కు ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

ములుగు(గజ్వేల్) : ములుగు అటవీ కళాశాల, పరిశోధన కేంద్రం(ఎఫ్‌సీఆర్‌ఐ)కి చెందిన పీహెచ్‌డీ విద్యార్థులు అక్కెనపల్లి స్నేహాంజలి, కటికల అనీశ్ ఇటీవల శంషాబాద్‌లో నిర్వహించిన జాతీయ యువజన జీవ వైవిధ్య సదస్సులో తెలంగాణ నుంచి పాల్గొన్నారు. 20, 21, 22 తేదీల్లో కొనసాగిన ఈ సదస్సుకు దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత విద్యార్థులు హాజరయ్యారు. రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, దేవాదాయ, పర్యావరణ, అటవీశాఖ మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిథులుగా హాజరై జీవ వైవిధ్యాన్ని యువత కాపాడి భవిష్యత్ తరాలకు అందించాలని సందేశం ఇచ్చారు. తెలంగాణ అటవీ మనిషి దుశ్చర్ల సత్యనారాయణ, బీజ్ మాత పద్మశ్రీ రహీబాయి సోమ పోపేరే అటవీ సంరక్షణ, విత్తనాల పరిరక్షణ, స్థిరమైన వ్యవసాయం, పక్షుల వీక్షణం, పాముల అవగాహన అంశాలపై ఈ సందర్భంగా చర్చించారు. వృక్ష స్థలాంతరణం, టిష్యూకల్చర్, ఆధునిక, సాంప్రదాయ పరిరక్షణ సాంకేతికలపై వర్క్‌షాపులు కొనసాగాయి. సదస్సుకు హాజరైన విద్యార్థులకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రశంసాపత్రాలను అందజేశారు.

వేర్వేరు చోట్ల ముగ్గురు అదృశ్యం

యాత్రకని వెళ్లి యువకుడు



ఆంజనేయులు

పటాన్‌చెరు టౌన్: యాత్రకు వెళ్తున్నానని చెప్పి వెళ్లిన యువకుడు అదృశ్యమయ్యాడు. ఈ ఘటన పటాన్ చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామానికి చెందిన ఆంజనేయులు డిసెంబర్ 13న స్నేహితుడు శ్రీకాంత్‌తో కలిసి యాత్రకు వెళ్తున్నానని, తిరిగి మూడు రోజుల్లో వస్తానని చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదు. సోదరుడు శివకుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కుంభమేళాకని వెళ్లి వ్యక్తి

పటాన్‌చెరు టౌన్: కుంభమేళాకు వెళ్తున్నానని చెప్పి వెళ్లిన వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ ఘటన పటాన్ చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పటాన్‌చెరు మండలం రామేశ్వరంబండ గ్రామానికి చెందిన పెంటయ్య 19న కుంభమేళాకు వెళ్తున్నానని చెప్పి వెళ్లాడు. భార్య ఫోన్ చేయగా కుంభమేళా నుంచి అయోధ్య వెళ్లి అక్కడి నుంచి కాశీకెళ్లి వస్తానని చెప్పాడు. 22న రాత్రి మళ్లీ ఫోన్ చేయగా సికింద్రాబాద్‌కు వచ్చే రైలు ఎక్కినట్లు తెలిపారు. ఆదివారం వస్తానని చెప్పి రాకపోగా ఫోన్ చేసినా స్విచ్ఛాఫ్ వచ్చింది. భర్త అదృశ్యంపై భార్య స్వప్న గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.



పెంటయ్య

వివాహిత అదృశ్యం

వివాహిత అదృశ్యమైన ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. రాజస్థాన్ కు చెందిన రమేశ్ బతుకుదెరువు కోసం వచ్చి అమీన్‌పూర్ పరిధిలోని వందనపురి కాలనీలో ఉంటూ కిరాణా షాపు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రమేశ్ భార్య నిర్మ బుధవారం భర్త ఫోన్ నుంచి గుర్తు తెలియని వ్యక్తితో మాట్లాడింది. గురువారం ఉదయం లేచి చూసేసరికి ఆమె కనిపించలేదు. భర్త తెలిసిన వారి వద్ద స్థానికంగా వెతికినా ఆచూకీ లభించలేదు. రమేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

చీర కొంగు బైక్ చక్రంలో చుట్టుకొని..

కిందపడటంతో తీవ్ర గాయాలై మహిళ మృతి

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): బైక్ పై నుంచి పడి మహిళ మృతి చెందిన ఘటన సదాశివపేట పట్టణంలోని బైపాస్ రోడ్డులో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. సీఐ మహేశ్ గౌడ్ కథనం మేరకు.. హైదరాబాద్‌లోని గాజులరామారానికి చెందిన వేదమని(49) భర్తతో కలిసి జహీరాబాద్‌కు వ్యక్తిగత పనుల నిమిత్తం వెళ్లింది. తిరిగి బైక్‌పై భర్తతో కలిసి హైదరాబాద్ వైపు వెళ్తుండగా మార్గమధ్యలో వెంకటాపూర్ బ్రిడ్జి వద్దకు రాగానే వెనుక కూర్చున్న వేదమని చీర కొంగు బైక్ చక్రంలో చుట్టుకోవడంతో ఒక్కసారిగా కిందపడింది. ఈ ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి భర్త సామెల్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

చెరువులో మునిగి మరో మహిళ



సావిత్రీ (ఫైల్)

చిన్నశంకరంపేట(మెదక్): ప్రమాదవశాత్తు చెరువులో పడి మహిళ మృతి చెందిన ఘటన చిన్నశంకరంపేట మండలం సూరారం గ్రామంలో చోటుచేసుకుంది. పేట ఎస్‌ఐ నారాయణ గౌడ్ కథనం మేరకు.. మండలంలోని సూరారం గ్రామానికి చెందిన తొంట సావిత్రీ(32) బుధవారం సాయంత్రం బట్టలు ఉతకడానికి స్థానిక పెద్ద చెరువు వద్దకు వెళ్లింది. బట్టలు ఉతుకుతున్న క్రమంలో కాలుజారి చెరువులో పడిపోయింది. రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో చెరువులో వెతకగా గురువారం ఉదయం మృతదేహం బయటపడింది. భర్త దుర్గయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ట్యాంకర్ ఢీకొని వ్యక్తి మృతి

కంది(సంగారెడ్డి): ట్యాంకర్ ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన కంది చౌరస్తాలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. రూరల్ ఎస్‌ఐ రవీందర్ కథనం మేరకు.. మండల పరిధిలోని తుంకిల్ల తండాకు చెందిన రమావత్ రాజు (45) కంది నుంచి తుంకిల్ల తండాకు బైక్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో జాతీయ రహదారిపై చౌరస్తా దాటుతుండగా వెనుక నుంచి ట్యాంకర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాజుకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

గల్లంతైన యువకుడు మృతదేహమై లభ్యం

హవేళిఘణాపూర్(మెదక్): చెరువులో గల్లంతైన యువకుడు మృతదేహమై లభ్యమైన ఘటన మెదక్ మండలం జానకంపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. జానకంపల్లి గ్రామానికి చెందిన మార్గం శోభ, భిక్షపతి పెద్ద కుమారుడు సందీప్(19) మహాశివరాత్రి రోజు ఒక్కపొద్దు విడిచేందుకు స్నేహితుడితో కలిసి బొల్లారం మత్తడిలో స్నానం చేసేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో నీటిలోకి దిగా స్నానం చేస్తుండగా జారిపోయి ఈత రాకపోవడంతో నీటమునిగాడు. అదే రాత్రి వెతికేందుకు వీల్లేక గురువారం ఉదయం గజ ఈతగాళ్ల సాయంతో వెతకగా మృతదేహం లభ్యమైంది.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని పోతంశెట్టిపల్లి గ్రామ శివారు ఏడుపాయల దేవస్థానానికి వెళ్లే మార్గంలో మొదటి బ్రిడ్జి ఫుట్‌పాత్ వద్ద గురువారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్‌ఐ మహమ్మద్ గౌస్ తెలిపారు. మృతుడి వయసు 35 నుంచి 40 ఏళ్లు ఉంటుందని, వంటిపై బూడిద రంగుతో కూడిన ఫుల్ షర్ట్, బ్లూ కలర్ జీన్ పాయింట్ ధరించి ఉన్నట్లు తెలిపారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి అరుంధతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని మెదక్ ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు తెలిపారు. తెలిసిన వారుంటే ఎస్‌ఐ కొల్చారం 87126 57919, మెదక్ రూరల్ సీఐ 87126 57916ను సంప్రదించాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పటాన్‌చెరు టౌన్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన పటాన్ చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని బీరంగూడకు చెందిన శివ చంద్ర ఐస్ క్రీమ్‌ను సైకిల్ పై విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నాడు. 26న పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని అమేధ ఆస్పత్రి సమీపంలో ఐస్ క్రీమ్ బండిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శివచంద్రకు తీవ్ర గాయాలు కాగా పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ హత్య

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): అనుమానాస్పద స్థితిలో మహిళ దారుణ హత్యకు గురైన ఘటన సదాశివపేట పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం సమీపంలో గురువారం ఉదయం వెలుగులోకి వచ్చింది. సదాశివపేట సీఐ మహేశ్ గౌడ్ కథనం మేరకు.. మండలంలోని నందికంది గ్రామానికి చెందిన సార చిన్న లక్ష్మి(39) కూలీ పనులు చేస్తూ జీవిస్తుంది. ఐదు రోజుల కిందట కొండాపూర్ మండలంలోని అనంతసాగర్ గ్రామంలో ఉండే కూతురు శిరీష దగ్గరకు వెళ్లింది. తిరిగి 26న కూతురితో కలిసి అనంతసాగర్ నుంచి సదాశివపేట పట్టణానికి వచ్చి కూరగాయలను కొనుగోలు చేసింది. అనంతరం కూతుర్ని అనంత సాగర్‌కు ఆటోలో పంపించింది. అనంతరం ఆమె స్వగ్రామం నందికంది గ్రామానికి వెళ్లి తిరిగి అదే రోజు రాత్రి పని ఉందని భర్తకు చెప్పి సదాశివపేటకు వచ్చింది. గురువారం ఉదయం ఎంపీడీవో కార్యాలయం సమీపంలో మృతదేహమై పడి ఉండటాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు కుటుంబీకులకు విషయాన్ని చెప్పారు. మృతురాలి తమ్ముడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎవరు హత్య చేశారు.. ఎందుకు హత్య చేశారనే దానిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

చిరుత దాడులు.. నిద్రలేని రాత్రులు

- తాజాగా కుక్క.. రెండు రోజుల కిందట దూడ హతం
- వ్యవసాయ పొలాలకు వెళ్లడానికి జంకుతున్న రైతులు
- జాగ్రత్తగా ఉండాలంటున్న అధికారులు
- రామాయంపేట శివారులో భయానక పరిస్థితులు



రైతులతో మాట్లాడుతున్న రేంజ్ అటవీ అధికారి విద్యాసాగర్

రామాయంపేట(మెదక్): చిరుత దాడులతో మున్సిపాలిటీ ప్రజలతోపాటు అటవీ ప్రాంతానికి దగ్గరలో ఉన్న గ్రామాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. రెండు రోజుల కిందట రామాయంపేట పట్టణ శివారులో దూడను హతమార్చిన చిరుత తాజాగా బుధవారం రాత్రి కుక్కను హతమార్చింది. చిరుత గతంలో ఎన్నడూ లేని విధంగా రామాయంపేట శివారులో ఉన్న ఎక్కలదేవుని బండ పై భాగం ప్రాంతం నుంచి వ్యవసాయ బావుల వద్దకు వస్తూ అలజడి సృష్టిస్తుంది. శివారు ప్రాంతంలో అక్కడక్కడ చిరుత పాదముద్రలు అగుపిస్తుండటంతో రైతులు భయాందోళనకు గురవుతున్నారు. రాత్రి పూట భయటకు వెళ్లాలంటేనే జంకుతున్నారు. దీంతో అటవీశాఖ అధికారులు పట్టణ శివారులో చిరుత తిరుగుతున్న ప్రాంతాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. చిరుత కదలికలు ఉండటంతో రైతులు అత్యంత జాగ్రత్తగా ఉండాలని, రాత్రి వేళల్లో బోర్ల వద్దకు వెళ్లొద్దని ఆ శాఖ అధికారులు హెచ్చరించారు. చిరుతను బంధించి తమకు కాపాడాలని రైతులు అధికారులను వేడుకున్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తాం



రామాయంపేట పట్టణ శివారులో ఇటీవలె చిరుత సంచారం వెలుగులోకి వచ్చింది. రైతులు జాగ్రత్తగా ఉండాలి. రైతులు రాత్రివేళ బోర్ల వద్దకు వెళ్లొద్దు. డే టైమ్‌లో మాత్రమే ఇద్దరు, ముగ్గురు కలిసి చేతుల్లో కర్రలు పట్టుకొని వెళ్లాలి. చిరుత ఆనవాళ్ల కోసం సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తాం. పలు చోట్ల హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయిస్తున్నాం. ఈ మేరకు అటవీ సమీపంలో ఉన్న గ్రామాలు, తండాల ప్రజలకు ముందస్తుహెచ్చరికలు జారీ చేశాం.

– విద్యాసాగర్, అటవీ రేంజ్ అధికారి, రామాయంపేట